కె. గురునాధ పిళ్లై

# మనసు మల్లెలు

అది బీరంగి కొత్తకోటలో ఉన్న యం.డి.ఓ. గారి ఆఫీసు గది. సమయం సాయంత్రం ఐదు గంటలు దాటింది. అప్పటికే అక్కడ పనిచేసే ఉద్యోగులు చాలామంది ఇళ్లకు వెళ్లిపోయినట్లు న్నారు. ఆఫీస్ బోసిగా కనిపిస్తోంది.

యం.డి.ఓ. గారికి, సౌజన్యకూ ఐదు నిమి షాల నుంచి వాగ్వాదం జరుగుతోంది.

"సౌజన్యా! ముందు ఇలా వచ్చి కూర్చో. అంత కోపమెందుకు? నేనేం కాని మాట అన్నా నని? నా మాటల్లో, చేతల్లో ఏదో అంతరార్ధ ముందని ఊహించలేవా? విజ్ఞులెన్నడూ తొం దరపడి ఒక నిర్ణయానికి రారు, రాకూడదు. మాటజారితే జీవితంలో ఆ తప్పు దిద్దుకోలేం" ఏదో నచ్చజెప్పే ధోరణిలో అన్నాడు యం.డి.ఓ.

"ఇంతవరకూ మాట్లాడింది చాలు. నలుగు రిలో నగుబాటయిందీ చాలు. నేను చెప్పేది వినండి... మొన్నటికి మొన్న మా స్కూల్ని విజిట్ చేశారు. ఓ.కే... అది మీ ఉద్యోగధర్మం. మీరెప్పుడైనా రావచ్చు, పోవచ్చు. ఆ అధికారం మీకుంది. అది తప్పని నేననను. కానీ మా హెడ్మాస్టర్ని తోడుగా పిలుచుకొని, ప్రత్యేకంగా నేనున్న తరగతి గదికివచ్చి 'బాగున్నావా సౌజ న్యా?' అని అడిగారు. అంత ప్రత్యేకంగా నన్ను పలకరించవలసిన అవసరమేముంది?

రోజూ స్కూల్ వదిలాక జ్యోతిచౌక్‌లో మద నపల్లెకు వెళ్లే బస్సుకోసం ఎదురు చూస్తుంటా ను. బస్సువచ్చేదాకా మరిద్దరు సహోద్యోగిను లతో కలిసి పిచ్చాపాటీ మాట్లాడుకుంటుంటాం. వారి ముందే, జీప్‌డ్రైవరుని పంపి, నన్ను పిలి పించి జీప్ ఎక్కించుకోవలసినంత బాంధవ్యం మీకూ నాకూ మధ్య ఏముంది? అంత ఉదార గుణం మీలోఉంటే వారినీ పిలవవచ్చుకదా! అలా ఈ ఒక్క నెలలోనే ఐదారుసార్లు నన్ను తీసుకొనివెళ్లారు. మరెవరినీ అలా పిలుచుకొని వెళ్లరెందుకు? నాపైన మీరు ప్రదర్శిస్తున్న అభి మానానికి అర్ధం ఏమిటి?

ఒకరోజు అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకం చేయడానికి హెడ్మాస్టరు గదికి వెళ్తున్నాను.

'సౌజన్యను ఒక్కరోజైనా చూడకుండా మన యం.డి.ఓ. ఉండలేకపోతున్నాడెందుకు రమ ణా?' అని అడుగుతున్న హెడ్మాస్టరు గొంతు వినిపించింది.

'రెండుమూడుసార్లు వాళ్లు గుసగుసలాడుకో వడం నేనూ చూసాను. వాళ్లమధ్య ఏదో లింకు న్నట్టే ఉంది గురూ...' అని వెకిలిగా నవ్వుతున్నా డు రమణ.

ఆడదానికి ఇంతకన్నా అవమానమేముం టుంది?

రచ్చ ఎందుకని రిజిస్టర్‌లో సంతకం చేసి ఏమీ తెలియనట్లు అక్కడినుంచి వచ్చేశాను.

'మమ్మల్నెవర్నీ పిలిచి లిఫ్ట్ ఇవ్వడే...? నిన్ను మాత్రం పిలుస్తాడెందుకు? ఏదో ఉంది... అదేదో నాకూ చెప్పవా?' అంటోంది సుజాత మేడం. ఇదంతా ఏమిటిసార్? ఆవేశంగాఅంది సౌజన్య.


"అదే చెప్పబోతున్నా..." అంటూండగానే

'ఐలవ్యూ' అంటాడేమో! అన్నాక బాధ పడడంకంటే ముందుగానే హెచ్చరించడం మేలు అనుకొంది సౌజన్య.

"సార్! ఇన్ని మాటలెందుకు? మా పాఠశాలకు రండి... పిల్లలకు పాఠాలు సరిగ్గా బోధిస్తున్నానో లేదో గమనించండి. నా ప్రవర్తన సరిగ్గా లేదంటే సస్పెండ్ చేయండి. లేదా జిల్లా పరిషత్‌కి సరెండర్ చేయండి. అంతేగానీ మీ మనసులో ఏ దురుద్దేశం లేకుంటే 'నీకెందుకింకా పెళ్లికాలేదు? ఎవరినైనా ప్రేమించావా?' అని నన్నెందుకు అడుగుతారు? నా స్వంత విషయాలు అడిగే హక్కు మీకెవరిచ్చారు?" అని అడుగుతూంటే సౌజన్య ముఖం కందగడ్డలా అయింది. ఆమె కళ్లలో కన్నీరుబికింది. ఉన్నట్టుండి ఏడ్వడం మొదలెట్టింది.

యం.డి.ఓ. గారికి నోరు తడారిపోయింది.

"సౌజన్యా! ముందా ఏడుపాపు. ఎవరైనా చూస్తే నవ్విపోతారు. ఒక మనిషి మనసులోని భావం అర్ధంచేసుకోవడం కష్టం. అపార్ధం చేసుకోవడం సులభం. నిన్నెందుకు పిలిపించానో, నీవంటే ప్రత్యేకమైన అభిమానం ఎందుకు ప్రద



ర్శిస్తున్నానో విను...” అంటూ బజర్ ప్రెస్ చేసారు.

ఆ శబ్దం వినగానే ప్రక్కనే ఉన్న గదితలుపులు తెరుచుకొన్నాయి. ఆఫీసు అటెండరు కనకారావు, గుమస్తా జగన్నాథం, యం.డి.ఓ. గారి గదిలోకి వచ్చారు. తననే పిలుస్తున్నారేమోనని అంతవరకూ ఎక్కడో బాతాఖానీ కొడుతున్న ఆఫీసు బంట్రోతు వెంకటప్ప పరుగున వచ్చాడు.

“సార్! సౌజన్య కింకా లోకంతీరు తెలియదు. తెలిసీ తెలియక ఏదో అంది... మీరేం అనుకోకండి” అన్నాడు కనకారావు.

“బాబాయిగారూ! మీరిక్కడ...” అంది సౌజన్య కనకారావుని చూస్తూ ఆశ్చర్యంగా.

“అమ్మాయ్! అయ్యగారు నిన్నిక్కడకి పిలిపించకముందే మమ్మల్నిద్దర్నీ ఈ ప్రక్క గదిలో కూర్చోమన్నారు. మీ ఇద్దరి మధ్యా జరిగే సంభాషణను శ్రద్ధగా వినమన్నారు. నిన్నెందుకు పిలిపించారో, మమ్మల్నెందుకిక్కడ ఉండమన్నారో కారణం చెప్పలేదు. ఎందుకని మేమూ ఆయనను అడగలేదు. ఎందుకిలా చేశారో కారణం ఆయనే చెప్పాలి” అన్నాడు కనకారావు.

సౌజన్య ఇంటికి మూడో ఇల్లే కనకారావుది. సద్బ్రాహ్మణుడు, సదాచార సంపన్నుడు, సచ్ఛీలుడూ అయిన ఆయనంటే ఆమెకు ప్రత్యేకమైన గౌరవభావం ఉంది. ఆయనకూ ఆమెపైన వాత్సల్య భావముంది. సాటి కులస్థురాలనే అభిమానమూ ఉంది.

“సౌజన్యా! అపార్థాలు అనర్థదాయకాలు. నీవు గుణవంతురాలివని, ఉద్యోగ నిర్వహణలో సమర్థురాలివనీ విన్నాను. నేను మరో మూడేళ్లకు రిటైర్ కావలసినవాడిని. నామనసులో ఏదో దురుద్దేశముందని నువ్వు అనుకొన్నావు.

మొదటిసారిగా నిన్నుచూడగానే నీలో ఏదో ప్రత్యేకత కనిపించింది. కనకారావు ఇంటి వద్దనే మీ ఇల్లు అనే విషయం తెలిసింది. నీ నడత గురించి, మీ కుటుంబ పరిస్థితుల గురించీ వాకబు చేశాను. ఆయన ద్వారా నీ గురించి తెలిశాక నిన్ను కోడలిగా చేసుకోవాలనే భావం నాలో కలిగింది.

ఇక అసలు విషయం విను... నాకొక కొడుకున్నాడు. పేరు గిరిధర్. సెక్రటేరియట్‌లో పెద్ద ఉద్యోగి. వాడికి పెళ్లి చేయవలసిన బాధ్యత నాకుంది కదా! ఐదారు పెళ్లిసంబంధాలు చూసాను. వాళ్లందరూ కోటీశ్వరుల బిడ్డలే. అయినా వాడు పెళ్లిచూపులకు ఆసక్తి చూపడు. వాడినేమడిగినా ‘ఊ’ అనడు ‘ఊహూ’ అనడు. ఈకాలం కుర్రకారు తీరు తెలిసిందే గదా!

‘నేనొక సంబంధం చూసాను. అమ్మాయి చాలా అందంగా ఉంటుంది. గుణవంతురాలనీ తెలిసింది. బీదకుటుంబమయినా సభ్యతా, సంస్కారాలు కలవారు. పెళ్లిచూపులు ఏర్పాటు చేయమంటావా?’ అని అడిగాను. నేను ఏ అమ్మాయిని ఉద్దేశించి ఆ మాటలన్నానో గ్రహించావనుకొంటా...

బదులేమీ చెప్పకుండా వాడు హైదరాబాదుకు వెళ్లిపోయాడు.

అక్కడి నుంచి నాకో ఉత్తరం వ్రాశాడు. ఇది చదువు... నీకే అర్థమౌతుంది” అంటూ ఒక ఉత్తరాన్ని సౌజన్యకు ఇచ్చాడు.

ఇతరుల ఉత్తరాలు చదవడం తప్పు అని సౌజన్య కాసేపు తటపటాయించింది. ఆ ఉత్తరం తనకివ్వడంలో ఏదో అంతరార్థముందని భావించి చదవడం మొదలెట్టింది.

ప్రియమైన నాన్నగారికి... గిరిధర్ నమస్కరించి వ్రాయునది. నేను అక్కడికి వచ్చినప్పుడు మీరు నన్నొకమాట అడిగారు. ఎవరినైనా ప్రేమించి ఉంటే చెప్పమని, నిరభ్యంతరంగా

పెళ్లిచేస్తానని. మీకు ఎదురుగా నిలబడి నా మనసులోని మాట చెప్పడానికి ధైర్యం చాలింది కాదు. అందుకే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

అవును... నేనిదివరకే ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆమె పేరు ప్రసన్నలక్ష్మి. ఆంధ్రా బ్యాంక్‌లో పనిచేసేది. ఆమె అందంగా ఉంటుం దనేది చాలా చిన్నమాట. ఆమె నడతా, కలుపు గోలుతనమూ నాకు బాగా నచ్చాయి. ఆమె పరిచయం చేసుకొన్నాను. ఆ పరిచయం దినది న ప్రవర్ధమానమై స్నేహంగా పరిణమించింది. పార్కులకు, సినిమాలకూ కలిసి తిరిగాం. ఆమె ను చూడకుండా ఒక్కరోజైనా ఉండలేననిపిం చేది. ఇక పెళ్లి ప్రస్తావన తేవడమే తరువాయి.

ఉదయమోహన్ అని నాకొక ప్రాణస్నేహితు డున్నాడు. అతను ఒక కోటీశ్వరుడి గారాల పుత్రుడు. అతని తండ్రి పలుకుబడి కల్గిన మంత్రివర్యుడికి మిత్రుడు.

ఉదయమోహన్‌కి ఇంకా పెళ్లికాలేదు. క్లబ్బు లో పేకాట, త్రాగుడు, పబ్బుల్లో అమ్మాయిలతో జల్సాలు... ఇవీ అతని నిత్యకృత్యాలు. నన్నూ తనతో కలవమని, ఆ ఆనందాలలో పాలుపం చుకోమని చాలాసార్లు బలవంతపెట్టాడు. అతని అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించేవాడిని. అయినా మా స్నేహానికి ఏలాంటి విఘాతమూ కలగలేదు.

స్నేహితులమన్నాక దాపరికాలేముంటా యి? అతనితో నేను ప్రసన్నను ప్రేమించినట్లు, ఆమెని పెళ్లాడాలనుకుంటున్నట్లూ చెప్పాను. నీ అభిప్రాయమేమిటని అడిగాను.

"ప్రసన్నా?..." అన్నాడు ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్న వాడిలా.

"ఆ గుర్తొచ్చింది... ఏదో బ్యాంకులో పనిచే స్తుంది... అందంగా ఉంటుంది... ఆవిడేనా?" అన్నాడు కాసేపటికి.

"ఏం ఆవిడతో నీకు పరిచయముందా?" అని అడిగాను.

"పబ్బుల్లో ఆవిడను రెండుమూడుసార్లు చూసినట్లు, ఒకసారి ఆవిడ నన్ను పలుకరించిన ట్లూ గుర్తుంది. ఇది జనవరినెల కదా! మార్చి నెల పదవతేదీన బర్త్‌డే పార్టీ ఉంది. అప్పటిదా కా ఆగు. ఆ తర్వాత పెళ్లి ప్రస్తావన తెద్దువుగా ని" అన్నాడు ఏదో ఆలోచిస్తున్నట్లుగా.

ఆ తరువాత ప్రసన్నను పది, పన్నెండు సార్లైనా కలిసి ఉంటాను. పెళ్లి ప్రస్తావన తెద్దామ నుకొనేంతలో ఉదయమోహన్ మాటలు గుర్తొ చ్చి ఆ విషయాన్ని వాయిదా వేస్తూ వచ్చాను.

మార్చినెల పదవతేదీ రానే వచ్చింది.

స్టార్ హొటల్లో ఏర్పాట్లన్నీ అట్టహాసంగా జరిగిపోతున్నాయి. నేనూ రెండుసార్లు వెళ్లి ఆ ఏర్పాట్లను పర్యవేక్షించాను.

రాత్రి ఎనిమిదిగంటలకు హొటల్‌కి వెళ్లా ను. ఆహూతులకు కావలసిన మందు, విందుల ఏర్పాట్లు జరిగిపోయాయి.

మరో పదినిమిషాలకు ఉదయమోహన్ వ చ్చాడు. వేడుక జరిగే హాలులో నీలి బల్బులను వేయించాడు. స్టేజిపైన ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చే సారు.

హాలుకి ఆనుకొని ఉన్న ఒక గదిలోకి నన్ను తీసుకువెళ్లాడు. అక్కడ వెలుగుతున్న బల్బులు తీసివేయించి, ఒక జీరో బల్బ్ పెట్టించాడు. అక్కడ మసక చీకట్లు అలుముకొన్నాయి.

ఇదంతా గమనిస్తున్న నాకు ఆశ్చర్యంవేసిం ది.

"గిరీ! ఇక్కడి నుంచి చూస్తే హాలులో జరిగే విషయాలు నీకు కనిపిస్తుంటాయి. ఎట్టి పరిస్థితి

లోనూ నువ్వు హాలులోకి రాకు. ఇదంతా ఏమిటి? ఎందుకు? అని అడగకు. నేను మళ్లీ వచ్చి కలుస్తా" అంటూ హడావిడిగా వెళ్లిపోయాడు.

నాకంతా అగమ్యగోచరంగా ఉంది. అతని ఆలోచన ఏమిటో అంతుపట్టడం లేదు. ఆ గదిలో నేనొక్కడినే... అక్కడే ఉన్న టీవీలో వార్తలు చూస్తూ కూర్చున్నాను. తొమ్మిది గంటలకు భోజనం వచ్చింది... తిన్నాను.

తొమ్మిది దాటాక అతిథులొక్కక్కరే రాసాగారు. ఎవరు తాగారో, ఎవరు తిన్నారో తెలియదు గానీ ఆ కార్యక్రమం పదిగంటలకు పూర్తయింది. స్టేజిపై ఫ్లడ్‌లైట్లు కాంతులు వెల్లువెత్తాయి. మేజిక్ షో మొదలైంది. ఆ తరువాత ఎవరో ఇద్దరు సుందరాంగులు సినిమా పాటలు పాడారు.

అసలు కార్యక్రమం అప్పుడు మొదలైంది. దేవతా వస్త్రాలలో మెరిసిపోతున్న ఒక స్త్రీ నాట్యం మొదలెట్టింది. అంతదాకా చప్పట్లతో సరిపుచ్చిన ఆహుతుల కేరింతలు, చప్పట్లు, ఈలలు చెప్పనలివి కాకుండా ఉన్నాయి. తరువాత మరో స్త్రీ, ఆ తరువాత మరో స్త్రీ.

పల్లెలు, పట్టణాలలో జరిగే ఇటువంటి రికార్డింగ్‌డ్యాన్స్‌లగురించి వినడమేగాని, నేనెప్పుడూ ప్రత్యక్షంగా చూసిందిలేదు. జుగుప్స కలిగిస్తున్న వారి అంగాంగ ప్రదర్శనలు చూస్తూ కేరింతలు కొట్టే వీళ్లా... నాగరికులు? అనుకొన్నాను.

పదకొండు గంటలకు ప్రదర్శన పూర్తయింది. స్టేజిపై ఒక పెద్ద టేబుల్ వేశారు. దానిపై పెద్దకేకొకటి తెచ్చిపెట్టారు. ఉదయమోహన్ స్టేజిపైకి వెళ్లాడు. ప్రేక్షకులు చప్పట్లు చరిచారు.

సరిగ్గా పన్నెండు గంటలకు కేకుపై వెలుగుతున్న కొవ్వొత్తులను నోటితో ఊది ఆర్పివేసాడు. కేక్ కట్ చేశాడు. అతని చుట్టూ గుమిగూడిన వారిలో ఇద్దరు కేకుముక్కలను అతని నోటికందించారు. అతనూ వారిద్దరికీ కేకు ముక్కలు అందించాడు. "హ్యాపీ బర్త్‌డే టూ యూ" అన్నారందరూ.


ఒక్కొక్కరే తాము తెచ్చిన కానుకలను ఉదయమోహన్‌కి అందించడం మొదలైంది. వారిలో ఒక స్త్రీ ఉదయమోహన్‌కి కానుక అందిస్తూ అతని చెంపపై ముద్దుపెట్టింది. ఉదయమోహన్ ఆమెను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు. ఆమె స్థిరంగా ఒకచోట నిలవలేకపోతున్నది. అప్పటికే ఆమె బాగా తాగినట్టుంది.

నేను ప్రేమించిన, పెళ్లాడాలనుకుంటున్న ప్రసన్నలక్ష్మిగా ఆమెను గుర్తించాను. నా మెదడు మొద్దుబారిపోయింది. గుండెలో గునపం గుచ్చుకున్నంత బాధగా ఉంది. ఉన్నట్టుండి ఫ్లడ్ లైట్ల కాంతులు ఆరిపోయాయి.

ఆడా మగా జంటలు జంటలుగా ఒకరి కౌగిళ్లలో ఒకరు కరిగిపోతున్నట్లు నాట్యం మొదలెట్టారు. వారందరిలోనూ ఉదయమోహన్, ప్రసన్నలక్ష్మిల జంట చూస్తుంటే... ఎందుకులే నాన్నా ఆ విషయం. తలచుకుంటూంటే నాకిప్పటికీ బాధగానే ఉంది.

ఉదయమోహన్ మాటలలోని మర్మం, ప్రసన్న నడతా చూసాక అర్థమైంది. నాన్నా! ఈ కాలపు అమ్మాయిలు సిరిసంపదలు, హోదాలు ఉన్నవారికి వలలు వేస్తారు. తమ కన్నెరికాన్ని ఎరవేస్తారు కూడా. సఫలమైతే పెళ్లి. విఫలమైతే?... నాలాంటి వారికి అర్థాంగులై తమ కలలు సాకారం కాలేదన్న అసంతృప్తితో జీవితాలు వెళ్లదీస్తారు.

నేను సంఘంలో గౌరవప్రతిష్ఠలున్న ఒక పెద్ద ఆఫీసర్ని. హోదా ఉందిగానీ కోట్లు లేవు




గా. మరి నాపైన ఆమెకు ప్రేమ ఎలా పుడుతుంది? అనుకొన్నాను. అంతకంటే నేను చేయగలిగింది మాత్రం ఏముంది? ఊరుకోక!

నాన్నా! ఈ ప్రేమలపై నాకు నమ్మకం సడలిపోయింది. నా హృదయం వడలిపోయింది. అనుభవజ్ఞులు, జీవితాన్ని కాచి వడబోసినవారు, నా క్షేమం కోరేవారు... నాకు మీరున్నారు. మీరెక్కడైనా సంబంధం చూడండి. మీకునచ్చిన అమ్మాయి తప్పకుండా నాకూ నచ్చుతుంది. పెళ్లిచూపులు ఏర్పాటుచేయండి. సెలవ్.

ఇట్లు, మీ... గిరి.

సౌజన్య ఆ ఉత్తరాన్ని యం.డి.ఓ. గారికి ఇచ్చింది.

"సౌజన్యా! ఇప్పుడసలు సంగతి నీకర్థమైందనుకొంటాను. నేను గిరికోసం ఐదారు సంబంధాలు చూసాను. నాకెవరూ నచ్చలేదు. అప్పుడు నాకళ్లు నీపైన పడ్డాయి. కనకారావుని నీ గురించి వివరాలడిగాను. ఆయన మీ కుటుంబ విషయాలన్నీ చెప్పాడు. నీవు నాకు బాగా నచ్చావు. కాబోయే కోడలివన్న అభిమానంతో నిన్ను ప్రేమగా పలుకరించేవాడిని. మనిద్దరి మధ్యా ఉన్న వయసు తేడావల్ల అపార్థాలు వస్తాయేమోనన్న ఆలోచనే రాలేదు. జరిగిందేదో జరిగిపోయింది. త్వరలో మంచిరోజు చూచుకొని మీ ఇంటికి పెళ్లిచూపులకు వస్తాము. నీకు ఇష్టమైతేనే సుమా!" అన్నాడు యం.డి.ఓ.

సౌజన్య బుగ్గలు కెంపులయ్యాయి.

"మీ ఇష్టం సార్!" అంది సిగ్గుతో తలవాల్చుకొని.

"సార్ అనే పిలుపుకు బదులు మావయ్యా అనే మాట త్వరలోనే వినాలనుంది" అంటూ నవ్వాడు యం.డి.ఓ.

ఆయనతోబాటు మిగిలిన ముగ్గురూ నవ్వుతూండడం గమనించి, మనసున మల్లెలు విరబూస్తుండగా సౌజన్య అక్కడినుంచి పరుగు తీసింది తనూ నవ్వుతూ, సిగ్గుపడుతూ. ●